క్లుప్తంగా

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రీనివాస్



కొడకండ్ల : బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలకేంద్రానికి చెందిన ముంజాల శ్రీనివాస్‌గౌడ్ నియామకమయ్యాడు.ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం బీసీలందరిని ఏకం చేసి తనవంతు కృషి చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దివాకర్, జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లిలో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, స్పందన అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొగుదుంపురం కిషోర్‌కుమార్ అన్నారు. శివునిపల్లిలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో యథేచ్ఛగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని, పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కుమార్, సతీష్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్ట్

బచ్చన్నపేట : మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై పోలీసులు శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం ఆ వ్యక్తి బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి కిడ్నాప్ చేసి మోసం చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు సదరు వ్యక్తిపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పోలీ సుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

కల్యాణ మండపం ప్రారంభం



కొడకండ్ల : మండలంలోని ఏడునూతుల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నూతన కల్యాణ మండప ప్రారంభోత్సవం శనివారం వైభవంగా జరిగింది. పురోహితుల ఆధ్వర్యంలో నిత్యారాధన, బాలభోగం, పుణ్యాహవచనం, నవకలశ స్థాపన, తిరుమంజసం, అలంకరణ, సుదర్శన హోమం, నూతన కల్యాణ మండప సంప్రోక్షణ అనంతరం కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అరవై ఏళ్ల క్రితం గ్రామం నుంచి వెళ్లిన నెల్లుట్ల సుధాకర్‌రావుకు వేణుగోపాలస్వామి కలలో వచ్చి మండపం నిర్మించాలని కోరడంతో మండపాన్ని నిర్మించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకుడు పాము లక్ష్మీనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'చామల'ను కలిసిన యువనాయకుడు కొమ్మూరి



జనగామ: భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని జనగామ యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, మండలాల అధ్యక్షులతో కలిసి ఆయన కిరణ్‌రెడ్డిని కలిసి సత్కరించారు.

పరామర్శ



నర్మెట: మండలంలోని గండిరామారం గ్రామానికి చెందిన గాదెపాక రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ శ్రేణులు బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి నిత్యావసర సరుకులతో పాటు రూ. 5వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, నాయకులు గద్దల రవి, చెవుల పరశరాములు, ప్రజ్ఞాపురం శ్రీధర్, యాకూబ్, రాజు, సుదర్శన్, రాజు, కుమార్, వెంకటయ్య, సాల్మన్, సంపత్, రమేష్, రాజశేఖర్, బాబు, శేఖర్ తదితరులున్నారు.

మాదిగల ద్రోహి కడియం శ్రీహరి

- ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్

స్టేషన్‌ఘన్‌పూర్: అధికార దాహం కోసం మాదిగ నాయకులను రాజకీయంగా ఎదగకుండా అణగదొక్కిన స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాదిగల ద్రోహి అని ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగపై కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జ్ గాదె శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారం కోసం అధికార పార్టీల భజన చేసే కడియం శ్రీహరికి మాదిగల హక్కుల కోసం పాలక పక్షాలను ఎదిరించే మంద కృష్ణను విమర్శించే అర్హత, హక్కు లేదన్నారు. గతంలో మాదిగలకు ద్రో హం చేసిన పార్టీలన్నీ కాలగర్భంలో కలిసిపోయానని, రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు అదే గతి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు జేరిపోతుల సుధాకర్,శ్రీనివాస్, ఏలియా, నాగరాజు, రవి, ఆదాం, గోవిందు ఇసాక్, ప్రశాంత్, అబ్బయ్య పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్ : అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

'కడియం'కు గుణపాఠం చెప్పాలి

రఘునాథపల్లి: తన స్వార్థం కోసం కన్నతల్లి లాంటి పార్టీని మోసం చేసిన కడియం శ్రీహరికి గుణపాఠం చెప్పేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు నడుం బిగించాలని జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు పిలుపునిచ్చారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కంచనపల్లిలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం పార్టీని వీడినంత మాత్రాన ఏం జరగదని, తన కూతురుకు ఎన్నికల్లో పరాభవం తప్పదన్నారు. సమావేశంలో టీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కందుకూరి ప్రభాకర్, ముసిపట్ల విజయ్, గైని శ్రీనివాస్, కొమురయ్య, రాంబాబు, దానిరెళులు, రాజేశ్వర్‌రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ కళింగరాజు

'భట్టి'ని కలిసిన నాయీబ్రాహ్మణ సంఘం నేతలు



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ అనుబంధ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా సంఘం నాయకులు శనివారం వేర్వేరుగా కలిశారు. సంఘం అధ్యక్షుడు వెంకన్న, ఉపాధ్యక్షుడు కొలిపాక సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు సంఘం తరపున మంత్రులను కలిసి వినతిపత్రాన్ని అందించారు. రాష్ట్రంలో నాయీబ్రాహ్మణులకు ఫెడరేషన్‌ను, కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు అవకాశాలు అందించాలని కోరారు. కలిసిన వారిలో శ్రీహరి, వెంకటస్వామి, వేణుగోపాల్, విజేందర్, శ్యామ్, కిరణ్, మల్లికార్జున్, రాఘవ, వాసు, నాగేష్, రవి, వెంకట్‌రావు, శ్రీనివాసరావు, సందీప్, పరమేష్ ఉన్నారు.

ముస్తాబైన రామాలయం

చిల్పూరు: మండలంలోని నష్కల్ ఆకేరు నదిఒడ్డున కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయం శ్రీరామనవమిని పురస్కరించుకుని రాములోరి కల్యాణానికి ముస్తాబైంది. ఆదివారం నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ కోరు కొప్పుల హరికిషన్‌గౌడ్, ఎంపీటీసీ పాశం శిరీషసురేష్‌లు తెలిపారు. ఆదివారం ఉదయం అధ్యయనోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 17న రాములోరి కల్యాణం, 21న ఆదివారం రథోత్సవం (డోపు) కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

దళారులకు తక్కువ ధరకు విక్రయించొద్దు

లింగాలఘణపురం: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని డీఏఓ వినోద్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని చీటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి కనీస మద్దతు ధర రూ.2203 పొందాలని సూచించారు. ఆయన వెంట డీఏఓ రోజారాణి, ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ అపూర్వ తదితరులు ఉన్నారు. కాగా ఆయా గ్రామాల్లో ఏఈఓల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు.



లింగాలఘణపురం : రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ వినోద్‌కుమార్

వసతులు కల్పించాలి

జఫర్‌గఢ్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని వసతులు కల్పించాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని ఓబులాపూర్, తమ్మడపల్లి (జి),సూరారం, తీగారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి వేగవంతంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

రఘునాథపల్లి: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ పురం యుగేందర్ నిర్వాహకులకు సూచించారు. శనివారం మండలంలోని శ్రీమన్నారాయణపురం,ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, సోమయ్యకుంటతండా, మాదారం, వెల్దిలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. సీసీలు సూత్రపు సంపత్, ఎల్లస్వామి, భాగ్యలక్ష్మి, రీనా వతి, సరోజన, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : సీఐ



పాలకుర్తి : ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలో వరంగల్ సీపీ ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంబర్‌ప్లేట్ లేని వాహనాలు, లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల డ్రైవర్లకు వాహనపత్రాల అవశ్యకత, రోడ్డు ప్రమాదాలపై తగు జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు సాయిప్రసన్న కుమార్, లింగారెడ్డి, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, కానిస్టేబుల్స్ కుమారస్వామి, శ్రీనివాస్, సంపత్ మారయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డాక్టరేట్ అందుకున్న శ్యాంప్రసాద్‌రెడ్డి



దేవరుప్పుల : మండలంలోని నీర్మాల గ్రామానికి చెందిన ఎడమ శ్యాంప్రసాద్‌రెడ్డి రాజస్తాన్‌లోని ప్రముఖ సన్‌రైజ్ విశ్వవిద్యాలయం నుంచి రసాయశాస్త్రంలో గైడ్ అనూప్‌కుమార్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నట్లు శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఘట్‌కేసర్‌లోని విజ్ఞాన భారతి ఇనిస్టిట్యూట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ డాక్టరేట్ అందుకోవడం గొప్ప విషయం అన్నారు.

బెల్టు షాపులు మూసివేయాలి

పాలకుర్తి: అన్ని గ్రామాల్లో బెల్టు షాపులను వెంటనే మూసివేయాలని స్థానిక యువకులు కోరారు. శనివారం ఎక్సైజ్ కార్యాలయంలో అధికారికి లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీధర్, శ్రవణ్, శోభన్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆలయానికి పల్లకి, వాటర్‌ఫ్రిజ్ బహూకరణ

పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడి శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయానికి పల్లకి, వాటర్‌ఫ్రిజ్‌ను దాతలు శనివారం అందజేసినట్లు ఈఓ భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన పింగిలి సంజీవరెడ్డి, కవిత, దాసరి శ్రీనివాస్, కల్పనాదేవి దంపతులు స్వామివార్లకు రూ.1లక్ష విలువైన పల్లకి, రూ. 50 వేల విలువైన వాటర్ ఫ్రిజ్‌ను అందజేసినట్లు ఈఓ తెలిపారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



జనగామ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయం తథ్యమని ప్రముఖ వైద్యుడు డాక్టర్ రాజమౌళి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశాన్ని మతతత్వ శక్తుల నుంచి కాపాడి, ఆర్థిక ప్రగతిలోకి తీసుకురావాలంటే ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈసారి రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. మూడు దశాబ్దాలుగా అంబేడ్కర్ ఆలోచన విధానం, ఆయన చూపిన మార్గంలో సామాజిక సేవ చేయడం జరుగుతుందన్నారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి గెలుపు కోసం అందరం కలిసి కష్టపడుతామన్నారు. సమావేశంలో మూడో వార్డు నాయకులు వంగపల్లి జనార్ధన్‌రెడ్డి, తూడి ప్రభాకర్, మోర్తాల ప్రభాకర్ తదితరులు పాల్గొని, డాక్టర్ రాజమౌళిని ఘనంగా సత్కరించారు.

వెంకన్న మృతి పార్టీకి తీరని లోటు

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్నులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోతి వెంకన్న (60) మృతి పార్టీకి తీరని లోటని గ్రామశాఖ అధ్యక్షుడు బిర్రు సోమేశ్వర్ అన్నారు. వెంకన్న మాజీ వార్డు సభ్యుడిగా విధులు నిర్వహించి పార్టీకి సేవలందించాడని అన్నారు. మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పి పూలు చల్లారు. మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని అన్నారు.

ముత్యాలమ్మ గుడికి గడప ప్రతిష్ఠ

తరిగొప్పుల: మండలంలోని జాలుబాయి తండాలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ అమ్మవారి గుడికి గడప ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో పూజారి బ్యాంగి శివాజీ, ఎంపీటీసీ భూక్య జుంలాల్‌నాయక్, సభావత్ రాజు, భూక్య రవి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీఎంహెచ్‌డీ అధ్యక్షుడు

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లికి చెందిన రాష్ట్ర తెలంగాణ మాదిగ హక్కుల దండోరా యూత్ అధ్యక్షుడు బాలకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. శనివారం మాదిగ హక్కుల దండోరా సంఘం నాయకులతో హైదరాబాద్‌లో సీఎంను కలిసి మాదిగల అభ్యున్నతి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి

జనగామ రూరల్: నిరంతరం ప్రజాసమస్యలపై పోరాటం చేసే సీపీఎం అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని సీపీఎం మండల కార్యదర్శి బోడ నరేందర్ అన్నారు. శనివారం మండలంలోని ఎర్రగొల్లపహాడ్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఉపాధి హామీ కూలీలను కలిసి అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీతి నిజాయితీతో పనిచేస్తున్న వ్యక్తి జాహంగీర్ అన్నారు. ప్రజల కోసం పని చేసే పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నరేందర్ కోరారు.

పీఆర్‌సీ బకాయిలు విడుదల చేయాలి

పాలకుర్తిటౌన్: ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పాత పీఆర్‌సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.హేమలత అన్నారు. శనివారం మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయుల సమస్యలు, బదిలీలు, ప్రమోషన్లు ఎక్కడ వేసిన గొంగళి అన్నట్లు ఉన్నాయని అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వీరమల్ల బాబయ్య అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్, సెల్ కన్వీనర్ వెంకన్న, శాగ నర్సయ్య, కొండయ్య,రమేష్, ఆర్.సరస్వతి,విజయరాణి, ప్రసాద్, రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరించిన ఉపాధ్యాయులు

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి



బచ్చన్నపేట: చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్లు

బచ్చన్నపేట : ప్రతి చిన్నారిని ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పనిసరిగా పంపించాలని అంగన్‌వాడీ టీచర్లు రమ, కమల, ప్రమీల్ అన్నారు. శనివారం మండలంలోని లింగంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లులు, గర్భిణులు, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశా వర్కర్లు లత, విజయ పాల్గొన్నారు.



జనగామ రూరల్‌లో...

పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు

జనగామ రూరల్: పిల్లల సర్వతోముఖాభివృద్ధికి అంగన్‌వాడీలు తోడ్పాటు అందిస్తున్నాయని అంగన్‌వాడీ టీచర్ రజిత అన్నారు. శనివారం పట్టణంలోని సాయినగర్, హనుమాన్‌వాడ -1 సత్రం కాలనీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్యలో, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలో పిల్లలకు వర్క్‌బుక్స్‌లో డ్రాయింగ్, పెయింటింగ్, కథలతో ఆట పాటలతో నైతిక విలువలను పెంపొందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టీచర్లు స్వర్ణలత, శ్రీవిజయ, అంజుమ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

లింగాలఘణపురం: వరంగల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీపీ చిట్ల జయశ్రీ ఉపేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్ కోరారు. శనివారం మండలంలోని లింగాలఘణపురం క్లస్టర్‌లోని లింగాలఘణపురం, బండ్లగూడెం, గుమ్మడవెల్లి, జీడికల్, రామచంద్రగూడెం, క్లాం క్లస్టర్‌లోని క్లాం, సిరిపురం, మాణిక్యాపురం, మంథోనిగూడెం, ఏనెబావి, నాగారం గ్రామాల్లో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కిరణ్‌కుమార్, వీరయ్య, శేఖర్, రవి, రాజు, మహేష్, శ్రీనివాసు, జనగామ కౌన్సిలర్ దయాకర్, పాల్గొన్నారు.

చిల్పూరు : డాక్టర్ సుధీర్‌కుమార్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని దేశాయి తండా, చిల్పూరు, వెంకటేశ్వరపల్లి, తీగలతండా గ్రామాల్లో పార్టీ మండల నాయకుడు జనగామ యాదగిరి అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు.



చిల్పూరు : మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కార్యక్రమాల్లో క్రాంతికుమార్, రాజన్‌బాబు, రవి, మహ్మద్ యా కూబ్, తోకల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. సుధీర్‌కుమార్‌ను శనివారం హనుమకొండలోని ఆయన నివాసంలో పార్టీ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి కృష్ణారెడ్డి, మండల నాయకుడు యాదగిరిలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రఘునాథపల్లి: సుధీర్‌కుమార్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ అన్నారు. జాఫర్‌గూడెం, మంగలిబండతండా, కంచనపల్లి, కోడూర్, బానాజీపేట గ్రామాల్లో కార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

దేవరుప్పుల : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే మా మిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ వార్షికోత్సవానికి కరస్పాండెంట్ తోటకూరి పాండుకృష్ణ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారుమూల గ్రామాల్లో దశాబ్దన్నర క్రితం ఇంగ్లిష్ మీడియం విద్య ప్రవేశపెట్టడం అభినందనీయం అన్నారు. నిరుద్యోగ జీవనాన్ని అధిగమించి విద్యావ్యవస్థను తయారు చేసి మరో యాభై మందికి ఉపాధి కల్పన, విద్యాభివృద్ధికి పాటుపడుతున్న యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఇలాంటి దిశలోనే హనుమాండ్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా స్కిల్స్ డెవలప్‌మెంట్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించడమే కాకుండా ప్రభుత్వపరంగా నిరాదరణకు గురైన ఉన్నత విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ప్రశాంతి విద్యానికేతన్ సొసైటీ డైరెక్టర్ టి.మల్లేష్‌యాదవ్, ప్రిన్సిపాల్ స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ జీవీకే ప్రసాద్, భువనగిరి ఎస్‌పీవీ ప్రిన్సిపాల్ యాదగిరి, రిటైర్డ్ హెచ్‌ఎం రమేష్‌శర్మ, న్యాయవాది రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ధర్మారెడ్డి, రవీందర్, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పశువుల తరలింపు అడ్డగింత



డీసీఎంలో ఉన్న పశువులు

రఘునాథపల్లి: పశువులను తరలిస్తున్న డీసీఎంను బీజేపీ అనుబంధ సంఘాలైన ఎస్సీ పరిరక్షణ కమిటీ, భజరంగదళ్ నాయకులు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన శనివారం మండలంలోని కోమల్ల టోల్‌ప్లాజా వద్ద చోటు చేసుకుంది. లింగాలఘణపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వారు గీసుకొండ మండలం కొమ్మాల అంగడికి వెళ్లి 14 పశువులను కొనుగోలు చేసి డీసీఎంలో తరలిస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో బీజేపీ అనుబంధ సంఘాలైన భజరంగ్‌దళ్, ఎస్సీ పరిరక్షణ కమిటీ నాయకులు పశువులు తరలిస్తున్న డీసీఎంను గుర్తించి 100కు ఫోన్ చేయడంతో పాటు వాహనాన్ని వెంబడించారు. కోమల్ల టోల్‌ప్లాజా వద్దకు పోలీసులు చేరుకోవడంతో డీసీఎంను వారికి అప్పగించారు. డీసీఎం వెంట ఉన్న వారు తాము సంతలో తమ అవసరాల కోసం పశువులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నామని, కొనుగోలుకు సంబంధించిన రాజార్లను (రశీదులు) పోలీసులకు చూపారు. అవి నకిలీ రశీదులని, పశువులను హైదరాబాద్ కబేళాలకే తరలిస్తున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా పశువులను హైదరాబాద్ కబేళాలకు తరలిస్తున్నారా..? లేక రైతుల అవసరానికి కొనుగోలు చేశారా ..? అనేది పోలీసుల విచారణలో తేలనుంది.

'గైడియల్ ఒలింపియాడ్'లో బాలయేసు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యజమాన్యం

దేవరుప్పుల: గైడియల్ ఒలింపియాడ్ ఎగ్జామ్‌లో మండలంలోని బాలయేసు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ర్యాంకును సాధించారని పాఠశాల కరస్పాడెంట్ జెసు రాజు శనివారం తెలిపారు. ఫిబ్రవరిలో పాఠశాలలో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో దేశవ్యాప్తంగా 18500 మంది పాల్గొనగా పాఠశాల నుంచి 3 వతరగతి నుంచి 10 తరగతి వరకు 129 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఇద్దరు స్టేట్‌ర్యాక్‌లు, ము గ్గురు జిల్లా స్థాయి ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. దావుల అమృత 6వ తరగతి స్టేట్ 6వ ర్యాంకు సాధించగా, యశ్విన్ 6వ తరగతి 11వ ర్యాంకు సాధించారు. జాన్సీబాయ్ జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించగా ఎల్పుల శ్రీనిధి రెండో ర్యాంకు, గుగులోత్ చాందిని 3వ ర్యాంకును సాధించారు. విద్యార్థులను పాఠశాల యజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయలు ఖాజా, మదన్‌మోహన్, మహేష్, అనిత, మాధవి, ఉష, సరిత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కో కన్వీనర్‌గా సాయిప్రసాద్



నియామకపత్రం అందుకుంటున్న సాయిప్రసాద్

స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సోషల్‌మీడియా, ఐటీ విభాగం కో కన్వీనర్‌గా మండలంలోని రాఘవాపూర్‌కు చెందిన గుర్రపు సాయిప్రసాద్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సాయిప్రసాద్ శనివారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో తాను చేస్తున్న కృషిని గుర్తించి బీజేపీ సోషల్ మీడియా నియోజకవర్గ కోకన్వీనర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. సోషల్ మీడియా వేదికగా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా అహర్నిశలు పనిచేస్తానన్నారు.